Sakshi                                                        01-24/06/15

హైదరాబాద్ । బుధవారం । జూన్ । 24 । 2015
సాక్షి

# 'మెట్రో' పరుగులు భేష్ : సీఎస్

- స్థలాల చుట్టూ కంచె ఏర్పాటు చేయాలని ఆదేశం
- స్పెషల్ టాస్క్‌ఫోర్స్ భేటీలో కీలక నిర్ణయాలు



మెట్రో పనులపై సమీక్షిస్తున్న చీఫ్ సెక్రటరీ రాజీవ్‌శర్మ, హెచ్‌ఎంఆర్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి

సాక్షి,సిటీబ్యూరో : నగరంలో వడివడిగా మెట్రో ప్రాజెక్టు పనులు చేపట్టేందుకు వీలుగా ఆస్తుల సేకరణ ప్రక్రియను వేగవంతం చేయడంపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రాజీవ్ శర్మ జీహెచ్‌ఎంసీ, హెచ్‌ఎంఆర్, రెవెన్యూ అధికారులను అభినందించారు. నిర్మాణ పరంగా క్లిష్టమైన ప్రధాన రహదారుల్లో 132 ఆస్తుల సేకరణ ప్రక్రియను వేగవంతం చేసి ఆయా ప్రాంతాల్లో ట్రాఫిక్ జాం లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మంగళవారం సచివాలయంలో జరిగిన ఉన్నతస్థాయి టాస్క్‌ఫోర్స్ కమిటీ సమావేశంలో మెట్రో పనుల పురోగతిపై ఆయన సమీక్షించారు. ఆస్తుల సేకరణ ప్రక్రియపై న్యాయస్థానాల్లో నమోదైన వ్యాజ్యాల పరిష్కారానికి అడ్వకేట్ జనరల్ సహకారం తీసుకోవాలని రెవెన్యూ అధికారులకు సూచించారు. మెట్రో పనుల కోసం కేటాయించిన స్థలాల చుట్టూ రక్షణ కంచె ఏర్పాటు చేయాలని, నిర్మాణ సంస్థ ఎల్‌అండ్‌టీ ఆయా ప్రాంతాల్లో నిర్మించ తలపెట్టిన నిర్మాణం పనులను తక్షణం ప్రారంభించాలన్నారు. మెట్రో వయాడక్ట్ సెగ్మెంట్ల కింద చెత్త చెదారం, మట్టి కుప్పలు వేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, వారి నుంచి జరిమానా వసూలు చేయాలన్నారు. సమావేశంలో మున్సిపల్ పరిపాలన శాఖ ముఖ్య కార్యదర్శి ఎంజీ గోపాల్,ముఖ్య కార్యదర్శులు అజయ్ మిశ్రా,బీఆర్ మీనా ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

Namasthe Telangana Dt 24/06/15

# డెబ్రిస్ డంప్ చేస్తే జరిమానా

**మెట్రో కారిడార్లపై నిరంతర నిఘా పెట్టాలి**

**అధికారులను ఆదేశించిన సీఎస్ రాజీవ్‌శర్మ**

నమస్తేతెలంగాణ, సిటీబ్యూరో : మెట్రో కారిడార్లలో రాత్రికి రాత్రే నిర్మాణ వ్యర్థాలు పోగవుతున్నాయి. ఎక్కడెక్కిడినుంచో డెబ్రిస్‌ను తీసుకొచ్చి వయాడక్ట్ కింద డంప్ చేస్తున్నారు. ప్రైవేట్ వ్యక్తులు డెబ్రీస్‌ను డంప్ చేయడానికి మెట్రో కారిడార్లనే ఎంచుకుంటున్నారు. దీంతో దుమ్ము ధూళి రోడ్లపైకి చేరుతోంది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ట్రాఫిక్‌కూ తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. ఈ వ్యర్థాలను డంపింగ్ చేయడానికి ఎల్అండ్‌టీ వర్గాలు అపసోపాలు పడుతున్నాయి. తాజాగా ఈ వ్యవహారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రాజీవ్‌శర్మ చెంతకు చేరింది. ఈ మేరకు మంగళవారం సచివాలయంలో నిర్వహించిన స్పెషల్ టాస్క్‌ఫోర్స్(ఎస్టీఎఫ్) సమావేశంలో సీఎస్ ఇదే అంశంపై సీరియస్‌గా చర్చ జరిగింది. దీనిపై కఠినంగా వ్యవహరించాలని, ఎవరైనా మెట్రో కారిడార్లలో డెబ్రీస్‌ను డంప్ చేస్తే జరిమానాలు విధించాలని సీఎస్ రాజీవ్‌శర్మ అధికారులను ఆదేశించారు. ఆయా మార్గాల్లో ఎల్అండ్‌టీ, జీహెచ్ఎంసీ, ట్రాఫిక్ పోలీసులు నిరంతరం నిఘా పెట్టాలని సూచించారు.

**మెట్రో ప్రాజెక్ట్ పురోగతిపై..**

సమావేశానికి ముందు హెచ్ఎంఆర్ ఎండీ ఎన్వీఎస్.రెడ్డి మెట్రో ప్రాజెక్ట్ పురోగతిపై.. గత సమావేశం అనంతరం తీసుకున్న చర్యలను పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు.

ప్రాజెక్ట్‌లో 132 ఆస్తుల సేకరణ మాత్రమే మిగిలిందని.. ఇవి పూర్తిగా ట్రాఫిక్‌కు సంబంధించినవని సీఎస్ దృష్టికి తీసుకువచ్చారు. కోర్టు కేసులతో నానుతున్న ఆస్తుల సేకరణ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని జంట జిల్లాల కలెక్టర్లు, జీహెచ్ఎంసీ అధికారులను సీఎస్ ఆదేశించారు. భూసేకరణ పూర్తి చేసిన తర్వాత మెట్రో నిర్మాణానికి వీలుగా బ్యారికేడింగ్ వేయడానికి అనుమతించాలన్నారు. విద్యుత్ స్తంభాలను తొలగించాలని.. ట్రాఫిక్ వాహనాలు నడిచేందుకు వీలుగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సమావేశంలో పురపాలన, పట్టణాభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎంజీ గోపాల్, జీఏడీ ప్రిన్సిపల్ సెక్రటరీ అజయ్‌మిశ్రా, రెవెన్యూ ప్రిన్సిపల్ సెక్రటరీ బీఆర్ మీనా, ఆర్థిక, దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శివశంకర్, న్యాయశాఖ కార్యదర్శి సంతోష్‌రెడ్డి, జలమండలి ఎండీ జగదీశ్వర్, మైనార్టీ సంక్షేమ శాఖ ప్రత్యేక కార్యదర్శి సయ్యద్ జలీల్ ఒమర్, జంట జిల్లాల కలెక్టర్లు కె. నిర్మల, రఘునందన్‌రావు, హైదరాబాద్ అడిషనల్ సీపీ (ట్రాఫిక్) జితేందర్, ఎల్అండ్‌టీ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎంపీ నాయుడు, హెచ్ఎంఆర్ సీఈ జియావుద్దీన్, ఇంజినీర్లు విష్ణువర్ధన్‌రెడ్డి, మల్లికార్జున్, రాజేశ్వర్‌రావు పాల్గొన్నారు.



స్పెషల్ టాస్క్‌ఫోర్స్ సమావేశంలో మాట్లాడుతున్న రాజీవ్‌శర్మ

Andhra Jyothi 01-24/06/15

మెట్రో పనుల

## వేగం పెంచాలి

- వ్యర్థాలను వేస్తున్న వారిపై గట్టి నిఘా పెట్టాలి
- మెట్రో కోసం సేకరించాల్సిన ఆస్తులు 132
- ప్రాజెక్టు పురోగతిపై సమీక్షా సమావేశంలో సీఎస్ రాజీవ్ శర్మ

6

# మెట్రో పనులు వేగంగా పూర్తి చేయాలి

- వ్యర్థాలను వేస్తున్న వారిపై గట్టి నిఘా పెట్టాలి
- మెట్రో కోసం సేకరించాల్సిన ఆస్తులు 132
- మెట్రో పురోగతిపై సమీక్షా సమావేశంలో సీఎస్ రాజీవ్ శర్మ



సచివాలయంలో మెట్రో ప్రాజెక్టు పురోగతిపై అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న సీఎస్ రాజీవ్‌శర్మ

ఆంధ్రజ్యోతి, హైదరాబాద్ సిటీ : మెట్రో పనులను వేగంగా పూర్తి చేయాలి. నగర వాసులకు ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా అన్ని శాఖ అధికారులు చర్యలు చేపట్టాలని సీఎస్ రాజీవ్‌శర్మ అధికారులను ఆదేశించారు. మంగళవారం మెట్రో ప్రాజెక్టు పనుల పురోగతిపై సచివాలయంలో అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా హైదరాబాద్ మెట్రో రైలు ఎండీ ఎన్వీఎస్.రెడ్డి రెండు వారాలుగా జరిగిన పురోగతిని సీఎస్‌కు వివరించారు. మెట్రో ప్రాజెక్టు కోసం ఇంకా సేకరించాల్సిన ఆస్తులు 132 మాత్రమే ఉన్నాయని తెలిపారు. ప్రాజెక్టు కోసం అవసరమైన ఆస్తుల సేకరణ సాఫీగా జరుగుతోందని వివరించారు. అనంతరం సీఎస్ రాజీవ్‌శర్మ మాట్లాడుతూ ఆస్తుల సేకరణ వేగంగా పూర్తయ్యేలా జీహెచ్‌ఎంసీ స్పెషల్ కమిషనర్‌తో పాటు రెండు జిల్లాల కలెక్టర్లు పూర్తిగా సహకరించాలని ఆదేశించారు. ఆస్తుల సేకరణలో కోర్టు వివాదాలుంటే అడ్వకేట్ జనరల్ సాయంతో వాటిని వెంటనే పూర్తి చేయాలని సూచించారు. మెట్రో కారిడార్లలో ప్రైవేట్ వ్యక్తులు వ్యర్థాలను డంపింగ్ చేయడాన్ని తీవ్రంగా పరిగణించారు. ఈ విషయంలో జీహెచ్‌ఎంసీ అధికారులు, ఎల్ అండ్ టీ మెట్రో రైలు అధికారులు గట్టి నిఘా ఏర్పాటు చేసి డంపింగ్ చేయకుండా చూడాలన్నారు. మెట్రో ప్రాజెక్టు పనులు త్వరితగతిన పూర్తి కావడానికి ఎక్కడైనా ప్రైవేటు, ప్రభుత్వ స్థలాలు అవసరమైతే వాటిని తీసుకొని పనులు వేగంగా జరిగేలా చూడాలన్నారు. మెట్రో మార్గాల్లో ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా ఏర్పాటు చేయడంతో పాటు రోడ్ల మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభాలను వెంటనే తొలగించాలని అధికారులను సీఎస్ ఆదేశించారు. సమావేశంలో మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎంజీ.గోపాల్, జీఏడీ ప్రిన్సిపల్ సెక్రటరీ అజయ్ మిశ్రా, రెవెన్యూ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బీఆర్.మీనా, జలమండలి ఎండీ జగదీశ్వర్, మైనార్టీస్ సంక్షేమ ప్రత్యేక కార్యదర్శి ఎం.సయ్యద్‌ఒమర్‌జలీల్, అదనపు సీపీ(ట్రాఫిక్) కె.జితేందర్, హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల కలెక్టర్లు కె.నిర్మల, ఎం.రఘునందన్ రావు, హెచ్‌ఎంఆర్, ఎల్‌అండ్‌టీ ఇంజినీరింగ్ విభాగం అధికారులు పాల్గొన్నారు.